క్లుప్తంగా

వరద బాధితులకు విరాళం



ఆర్థిక సాయం అందజేస్తున్న మల్లికార్జునరావు

రాజానగరం: దివాన్ చెరువుకు చెందిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వంక మల్లికార్జునరావు విజయవాడలోని వరద బాధితులకు రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్రావు ద్వారా ప్రభుత్వానికి అందించారు.

విజయదుర్గమ్మకు పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గమ్మ

పెదపూడి: సంపర గ్రామంలో కొలువైన విజయదుర్గమ్మకు పంచామృతాభిషేకం శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా కంకుమ పూజలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో అమ్మవారికి అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు భక్తులతో లలితా, విష్ణు సహస్ర నామ పారాయణ చేయించారు.

నిత్యావసరాల అందజేత



సరకులు అందజేస్తున్న తహసీల్దార్ రమణి

బిక్కవోలు: గ్రామానికి చెందిన వడ్డి మరియ్యమ్మ, బుద్దాల రమణ కుటుంబాలకు 25 కేజీల చొప్పున బియ్యం, ఊరగాయలు, నూనె తదితర సామగ్రిని తహసీల్దార్ రమణి అందించారు. ఇటీవల కురిసిన వర్షాలకు వీరి ఇల్లు దెబ్బతినడంతో ఈ సాయం అందజేశారు. బిక్కవోలు రెవెన్యూ కార్యాలయం వద్ద శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. డీటీ కృష్ణ, మాజీ ఎంపీటీసీ గొర్రెల త్రిమూర్తులు, పాలచర్ల చిట్టిబాబు చౌదరి, వీఆర్వో కొటాని అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య ధ్రువీకరణ పత్రాల అందజేత



పందలపాకలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న నాయకులు

బిక్కవోలు: మిషన్ వాత్సల్య పథకం ఎంపికైన పందలపాక గ్రామంలోని లబ్ధిదారులకు ఉప సర్పంచ్ పడాల వెంకట రామారెడ్డి శుక్రవారం ధ్రువీకరణ పత్రాలు అందించారు. పంచాయతీ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలోఉప సర్పంచ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలు, హెచ్ఐవీ బాధిత చిన్నారులఉకు మిషన్ వాత్సల్య పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.4 వేలు చొప్పున 6 నెలలకు రూ.24 వేలు అందిస్తుందన్నారు. ఈ పథకానికి గ్రామానికి చెందిన షేక్ వహీదా, కోరాడ నవీన్ కుమార్, నులుకుర్తి జోష్ వినయ సంపత్ ఎంపికయ్యారన్నారు.

మందుల వితరణ



డాక్టర్ చైతన్యకు మందులు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సీతానగరం: మిర్తిపాడుకు చెందిన తానా డైరెక్టర్ (యూఎస్ఏ) నిమ్మలపూడి జనార్దన్ స్థాపించిన తారక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మిర్తిపాడులో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు రూ.లక్ష విలువైన అత్యవసర మందులను అందజేశారు. సర్పంచ్ బంగారు సత్యవతి, నిమ్మలపూడి గిరిధర్, ఉపసర్పంచ్ వాకలపూడి రామకృష్ణ చేతుల మీదుగా సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకె చైతన్యకు వీటిని అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ బి.శైలజ, ఏఎన్ఎం బి.కుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల (గెస్ట్ లెక్చరర్) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.హేమ తెలిపారు. వృక్షశాస్త్రం (బోటనీ), జంతుశాస్త్రం (జువాలజీ) సబ్జెక్టులు బోధించడానికి పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఆసక్తి కలవారు ఈ నెల 17వ తేదీ లోపు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వారికి ఈ నెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

అమ్మో ఎలుకలు

- వరిపంటపై మూషికాల దాడి
- పంట దిగుబడిపై ప్రభావం
- రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు



ఎలుకల నిర్మూలనకు ఎరను తయారు చేయడంపై రైతులకు అవగాహన కలిగిస్తున్న సిబ్బంది

రాజానగరం: ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేస్తున్న రైతులు మంచి దిగుబడులు సాధించేందుకు కసరత్తు చేస్తున్నారు. విత్తనాలు చల్లడం నుంచి కోతకు వచ్చే వరకూ దిగుబడులను పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఎలుకలు మాత్రం వారికి భయపెడుతున్నాయి. చేతికి అందే పంటను కొరికేస్తూ నష్టం కలిగిస్తున్నాయి. దీంతో దిగుబడిపై అధిక ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో ఎలుకల నిర్మూలనకు సామూహికంగా చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఈ మేరకు రైతులు అవగాహన కల్పిస్తున్నారు.

64,965 ఎకరాలలో వరిసాగు

రాజానగరం, అనపర్తి నియోజకవర్గాలలో ప్రస్తుతం 64,965 ఎకరాలను వరిసాగు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలు రాజానగరం నియోజకవర్గ పరిధిలోని కోరుకొండ, సీతానగరం మండలాలలో కొంతమేర రైతులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాలకు ముందుగానే సాగు చేసిన ప్రాంతాలలో వరి పొలాలు చిరుపొట్ట దశలో ఉన్నాయి. ఈ సమయంలో పంటను నిరంతరం పరిశీలిస్తూ, ఎలుకల బారిన పడకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

తీసుకోవాల్సిన చర్యలు

సాధారణంగా ఎలుకలు పొలాలలో గట్ల వెంబడి బొరియలు చేసుకుని, వాటిలో జీవనం సాగిస్తుంటాయి. ఆ బొరియలను గుర్తించి, వాటిలో పొగ పెడితే ఊపిరాడక అవి చనిపోవడం లేదా ఆ ప్రాంతం వదిలి దూరంగా పారిపోవడం చేస్తాయి. కొందరు బొరియల వద్ద ఎలుకలను పట్టుకునేందుకు బోన్లు పెట్టిస్తుంటారు. మరికొంతమంది పొలంలో బుట్టలు పెట్టి ఎలుకలను పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. వీటన్నికంటే ఎలుకలను నిర్మూలించేందుకు క్రిమిసంహారక మందుతో తయారు చేసిన ఎరలే మంచి ఫలితాలనిస్తాయి.

సామూహిక చర్యలతో ఫలితాలు



పొలాలలో ఎలుకల నివారణను రైతులందరూ సామూహికంగా చేపడితే మంచి ఫలితాలు ఉంటాయి. వేర్వేరుగా చేపట్టడం వల్ల ఎలుకలు పక్కనే ఉన్న పొలంలోకి పారిపోయే అవకాశం ఉంది. కాబట్టి సామూహిక చర్యలతోనే మంచి ఫలితాలు ఉంటాయి.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయాధికారి, రాజమహేంద్రవరం

ఎర తయారీ

బ్రొమోడయలిన్ 50 మిల్లీగ్రాముల మందును రెండు కిలోల బియ్యంలో కలిపి ఎరను తయారు చేసి, గుర్తించిన బొరియల వద్ద ఉంచాలి. అయితే ఈ పని చేయడానికి రెండు రోజుల ముందు ఎలుకలకు నమ్మకాన్ని కలిగించే విధంగా రసాయన మందు కలపకుండా నూనె, బియ్యం కలిపి ఆ బొరియల వద్ద ఉంచాలి. వాటిని తిన్న ఎలుకలకు ఒక నమ్మకం కలుగుతుంది. ఆ తరువాత రసాయన మందు కలిపిన ఎరను పెడితే అదే నమ్మకంతో తిని, మరణిస్తాయి. ఇది కాకుండా పాస్పేట్, జింక్ సల్ఫేట్‌తో తయారు చేసిన బిస్కెట్లతో కూడా ఎలుకలు చనిపోతాయి. ఈ బిస్కెట్లను బొరియలలో వేస్తే, వాటి ద్వారా వ్యాపించే గాలిని పీల్చుకుని ఎలుకలు చనిపోతాయి. అయితే ఈ సమయంలో బిస్కెట్లను చాలా జాగ్రత్తగా ఉపయోగించాలి. లేకుంటే కొత్త సమస్యలు ఎదురవుతాయి.



మాజీ ముఖ్యమంత్రి జగన్‌తో మాట్లాడుతున్న జక్కంపూడి రాజా

వంద కార్లలో పిఠాపురానికి..

రాజానగరం: ముంపు బాధితులను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పిఠాపురంలో పర్యటించారు. ఈ నేపథ్యంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి సుమారు వంద కార్లలో పార్టీ శ్రేణులు పిఠాపురానికి తరలివెళ్లారు. వారిలో రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- గణనాథునికి ప్రత్యేక పూజలు



రామేశ్వరంలో గణపతిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యానారాయణరెడ్డి అన్నారు. రామేశ్వరంలో సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కొటికలపూడి చినబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకున్ని సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ఉత్సాహంగా నిర్వహించాలన్నారు. ముందుగా వారికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, కొటికలపూడి గోపి, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు వాసు, రమణ, నక్కా రాజు, రాపర్తి కృష్ణ, శ్రీనివాస్‌కుమార్, చపట్టి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

- జి.మామిడాడ ధ్వజస్తంభం వీధిలోని గొలుగూరి రాఘవరెడ్డి పందిరిలో ఏర్పాటు చేసిన గణపతిని మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. వారిని ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, ఉప సర్పంచి మేడపాటి తాతారెడ్డి, ద్వారంపూడి అమ్మిరెడ్డి, ద్వారంపూడి రమేష్‌రెడ్డి, సబ్బెళ్ల రామలక్ష్మణులు, కర్రి శ్రీవెంకటరెడ్డి, కర్రి రాఘురామచంద్రారెడ్డి, కర్రి శ్రీరామచంద్రరెడ్డి, ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి, ద్వారంపూడి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నేడు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బిక్కవోలు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బిక్కవోలులోని ఫార్మా కంపెనీ బాధిత కుటుంబానికి శనివారం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీ దుర్ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున అందజేయాలని మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారన్నారు. దానిలో భాగంగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శనివారం మధ్యాహ్నం 2 గంటలకు బిక్కవోలులోని కొప్పర్తి గణేష్ కుటుంబానికి సాయం అందిస్తారన్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు



వినాయకుని సన్నిధిలో సినీనటుడు కాశీ విశ్వనాథ్

సీతానగరం: రఘుదేవపురం చెరువుగట్టు వద్ద వినాయకుని ఆలయం సమీపంలో పార్వతీ తనయ గణపతి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణపతిని శుక్రవారం సినీనటుడు, దర్శకుడు యనమదల కాశీ విశ్వనాథ్ దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ గణపతి విగ్రహాలను నిమజ్జనం చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ధ్రువీకరణ పత్రాల ప్రదానం



సర్టిఫికెట్లు అందజేస్తున్న వెంకటేశ్వరరావు

రంగంపేట: మహిళలు వివిధ రంగాలలో రాణిస్తూ తమ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలబడాలని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. జి.దొంతమూరు గ్రామంలో మగ్గం వర్క్ శిక్షణ ముగించుకున్న 60 మంది మహిళలకు శుక్రవారం ధ్రువీకరణ పత్రాలు అందించారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

పెదపూడి: పుట్టకొండలో పారిశుధ్యం మెరుగుకు మరిన్ని చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ వల్లు వెంకటరమణ తెలిపారు. ఆ గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో అనారోగ్యాలు తలెత్తకుండా గ్రామంలో పరిశుభ్రత పనులు చేపట్టారు. దీనిలో భాగంగా దోమల నివారణకు ఎబేట్ మందును, మురుగు కాలువల్లో బ్లీచింగ్‌ను చల్లించారు. రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలను జేసీబీ సాయంతో తొలగించారు.

రాంబాబు మాస్టారు సేవలు అభినందనీయం



రాంబాబు మాస్టారును సత్కరిస్తున్న హెచ్‌ఎం అరుణ తదితరులు

రంగంపేట: రాంబాబు మాస్టారు సేవలు అందరికీ ఆదర్శనీయమని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రధానోపాధ్యాయురాలు గరిమెళ్ల అరుణ అన్నారు. ఆమె తన తల్లిదండ్రులు గరిమెళ్ల సుబ్బలక్ష్మి, జగన్నాథశాస్త్రి, సోదరుడు హరికృష్ణ స్మారకార్థం చంద్రేడు ప్రాథమిక పాఠశాల పూర్వ ఉపాధ్యాయుడు కొరపాటి రాంబాబుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో రాంబాబు మాస్టారు చేసిన కృషి చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశామన్నారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా, ఉపాధ్యాయుడిగా రాంబాబు చేసిన సేవలను చంద్రేడు హైస్కూల్ హెచ్‌ఎం గంటా రమణబాబు, పూర్వపు హెచ్‌ఎం ఫణికుమార్, యూటీఎఫ్ నాయకులు వి.యబాబు ప్రశంసించారు.

స్కూల్ గేమ్స్ టోర్నమెంట్ ప్రారంభం



బిక్కవోలులో తలపడుతున్న క్రీడాకారులు



రంగంపేటలో పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న

బిక్కవోలు: గ్రామంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ టోర్నమెంట్ ఎంపికలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంఈవో-2 కె.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చెస్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా పోటీలు జరుగుతున్నాయన్నారు. 14 నుంచి 17 ఏళ్ల నుంచి వయసున్న క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. హెచ్‌ఎం పల్లా వీర ప్రభాకర్, పీడీలు పర్యవేక్షించారు.

రంగంపేటలో..

రంగంపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా మండల స్థాయి క్రీడా పోటీలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వి.పార్థసారథి మాట్లాడుతూ అండర్ 14, 17 విభాగాల్లో వాలీబాల్, ఖోఖో, షాట్‌పుట్, రన్నింగ్ తదితర విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. శుక్ర, శనివారాల్లో బాలికలకు, మంగళ, బుధవారాల్లో బాలురకు పోటీలు జరుగుతాయన్నారు.

అన్నసమారాధన



అన్నసమారాధన చేస్తున్న కమిటీ సభ్యులు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని సరిపల్లిపేట వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న గణపతి మందిరంలో నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కొంకుదురు వెలంపేటలోని బాల గణపతి ఆలయం వద్ద కూడా అన్నసమారాధన జరిగింది.

అక్టోబర్ నుంచి ఎల్ఐసీ కొత్త పాలసీలు

రాజానగరం: భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ప్రస్తుతం అందిస్తున్న జీవిత బీమా పాలసీల స్థానంలో అక్టోబర్ ఒకటి నుంచి కొత్త పాలసీలు వస్తాయని రాజమహేంద్రవరం రూరల్ బ్రాంచ్ మేనేజర్ డీఎస్‌వీ సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన రాజానగరం క్లస్టర్ ఎల్ఐసీ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్కువ ప్రీమియం, మంచి బోనస్ రేట్లతో కూడిన ప్రస్తుతం ఉన్న పాలసీలను పొందాలంటే ఈనెలాఖరు వరకే అవకాశం ఉందన్నారు. వచ్చే కొత్త పాలసీలలో ప్రీమియం పెరగడంతోపాటు అనేక మార్పులు వచ్చే అవకాశం లేకపోలేదన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేసి, గడువు ముగిసేలోగా ప్రస్తుతం ఉన్న పాలసీలను విక్రయించడంలో ముందంజ వేయాలని ఏజెంట్లకు సూచించారు. ఇప్పటికే తీసుకున్న వారికి, నెలాఖరులోగా చేసిన వారికి ఈ పాలసీలకు సంబంధించిన అన్ని రకాల ప్రయోజనాలు కొనసాగుతాయన్నారు. సమావేశంలో ఏబీఎం అబ్రహం చక్రవర్తి, క్షేత్ర విస్తర్ణాధికారి వై.కాశీవరప్రసాద్, రాజానగరం క్లసర్ పరిధిలోని ఏజెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

బిక్కవోలు: మండలంలోని ఉపాధి హామీ పనులపై 17వ విడత సామాజిక తనిఖీ జరుగుతోందని ఉపాధి ఏపీవో అగస్టీ కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ 1-4-2023 నుంచి 31-3-2024 వరకూ చేపట్టిన పనులపై గ్రామ స్థాయిలో తనిఖీ చేస్తారన్నారు. అనంతరం ఈ నెల 21న మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు. ఈ నెల 15న ఆర్ఎస్‌పేట, మెళ్లూరు, 16న పందలపాక, కాపవరం, 17న బలభద్రపురం, రంగాపురం, 18న ఊలపల్లి, 19న కొమరిపాలెం, ఇలపల్లి, 20న తొస్సిపూడి, కొంకుదురు, ఆరికరేవుల, బిక్కవోలు గ్రామాల్లో సభలు జరుగుతాయన్నారు.

27న యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల సమ్మె



ధర్నా చేస్తున్న యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: బ్యాంక్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27వ తేదీన దేశ వ్యాప్తంగా యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు, అధికారులు సమ్మె చేపట్టనున్నారని ఆ బ్యాంక్ ఆఫీసర్స్ సంఘ నాయకుడు లక్ష్మీపతిరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఇన్నీసుపేటలోని యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. లక్ష్మీపతిరావు మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. కొత్తగా నియామకాలు చేయకపోవడంతో ఖాతాదారులకు మెరుగైన సౌకర్యాలు అందడం లేదని, ఉన్న ఉద్యోగులపై పనిభారం పడుతోందన్నారు. కొన్ని కార్పొరేట్ ఏజెన్సీల సలహాలను, సూచనలు తీసుకోవడం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదని, దీనివల్ల బ్యాంక్‌కు ఖాతాదారులు దూరమవుతున్నారన్నారు. కార్యక్రమంలో విమెన్ కన్వీనర్ కేవీ స్వాతి పాల్గొన్నారు.

ఉన్నతంగా జీవించాలంటే విద్యలో రాణించాలి

- ఆచార్య రామ్మోహనరావు
- జీజీయూలో మేథ ఉత్సవాలు ప్రారంభం




సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య రామ్మోహనరావు

రాజానగరం: ఉన్నతంగా జీవించాలంటే విద్యలో రాణించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఇన్‌చార్జి ఆచార్య కె.రామ్మోహనరావు అన్నారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో రెండు రోజుల పాటు జరిగే మేథ సాంకేతిక ఉత్సవాలను శుక్రవారం ఆయన జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ విజ్ఞానంతో పాటు నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాలు ఉంటేనే సమాజంలో గుర్తింపు పొందవచ్చన్నారు. అందుబాటులో ఉన్న అవకాశాలను సమర్థంగా వినియోగించుకుంటే మంచి ఫలితాలను అందుకుంటారన్నారు. యుక్త వయస్సులో సాధారణంగా వచ్చే భావోద్వేగాలను నియంత్రించుకోగలిగితే లక్ష్యాన్ని చేరుకోవడం సులభమవుతుందన్నారు. తల్లిదండ్రులు చేస్తున్న త్యాగాలను మరువకుండా, మానవతా విలువలతో ఉన్నతంగా ఎదగాలని యువ ఇంజినీర్లకు హితవు పలికారు. ఈ రోజు ఉన్నత స్థానంలో ఉన్న వారందరూ ఒకప్పుడు విద్యార్థులేనన్నారు. తొలుత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), వీసీ డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా యూనివర్సిటీలు పనిచేయాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి చైర్మన్ ఆచార్య కె.రామ్మోహనరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తదితరులతో సమావేశమయ్యారు. రామ్మోహనరావు మాట్లాడుతూ ఉన్నత విద్యా మండలిలో ఇటీవల అనేక మార్పులు చేశామన్నారు. వాటికి అనుగుణంగా యూనివర్సిటీ పనిచేయాలన్నారు. పరీక్షా పత్రాలను మూల్యాంకనాన్ని మరింత సమర్థంగా చేయడానికి డిజిటల్ మూల్యాంకణాన్ని ప్రవేశపెట్టే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ ఐడీలను విద్యార్థులంతా క్రియేట్ చేసుకోవాలన్నారు. తద్వారా సర్టిఫికెట్లను డిజిటల్ రూపంలో భద్రపర్చుకోవడానికి, ఉపయోగించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

సినీ గేయ సార్వభౌముడు ఆత్రేయ



ఆత్రేయ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రిన్సిపాల్ రాజబాబు తదితరులు

సీటీఆర్ఐ: సినీగేయ సార్వభౌముడు ఆత్రేయ అని తెలుగుశాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ, తెలుగు సారస్వత పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్రేయ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ మనిషికి మనసుకు ఉన్న అనుబంధాన్ని ఆత్రేయ చెప్పినంతగా మరి ఏకవి కూడా పేర్కొలేదన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబిల్ రాజబాబు మాట్లాడుతూ ఆయన కలం నుంచి వచ్చిన సంభాషణలన్నీ తాత్విక ధోరణితో ఉంటాయన్నారు. జీవిత తత్వాన్ని గుట్టువిప్పి, జీవితాన్ని కాసి వడపోసిన నగ్నసత్యాలేనని అన్నారు. అధ్యాపకుడు ఎస్.రాజ్ కుమార్ మాట్లాడుతూ ఆయన అసలు పేరు కిళాంబి నరసింహాచార్యులు అని, పేరు గోత్రాన్ని కలిపి ఆచార్య ఆత్రేయ అనే కలం పేరుతో ప్రసిద్ధి చెందారన్నారు. పల్లి సుధా మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబాల సమస్యలను తీసుకొని మనోహరమైన నాటకాలుగా మలిచారని అన్నారు. టీసీవై రత్నం, చర్ల సీతారామనాయుడు పాల్గొన్నారు.

మంచి అలవాట్లతో ఆరోగ్యం

కంబాలచెరువు: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని జిల్లా ఇన్‌చార్జి పాఠశాల విద్యాశాఖాధికారి వి.వెంకటరాజు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మ్యాజిక్ బస్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన జాతీయ పౌష్టికాహార వారోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రమైన పోషకాహారాన్ని మాత్రమే భుజించాలన్నారు. జంక్ ఫుడ్‌కు సాధ్యమైనంత వరకూ దూరంగా ఉండాలన్నారు. ఐసీడీఎస్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి నరసమ్మ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంలో విద్యార్థులకు పోషకాహారం అందజేస్తున్నారన్నారు. పోషక విలువలు పెంచేందుకు కృత్రిమ విటమిన్లు, సప్లిమెంట్లు కలపడాన్నే పోర్టిఫైడ్ అంటారన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ అనూహ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనత నిరోధించేందుకు పరీక్షలు జరిపి, అవసరమైన వారికి ఐరన్, ఫోలిక్ ఆసిడ్ మాత్రలు అందజేస్తున్నారన్నారు.

టంగుటూరి జీవితం అందరికీ ఆదర్శప్రాయం

కంబాలచెరువు: మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమర యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెమినార్ హాల్లో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం టంగుటూరి అవార్డుల ప్రదానోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకొని పీజీసెట్ పరీక్ష రాసి ఒకటి నుంచి వందలోపు ఉన్నత ర్యాంకులు సాధించిన విద్యార్థులకు టంగుటూరి పేరిట అవార్డులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావు ఆర్కే మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాలకు పూర్వ విద్యార్థుల సంఘం నిరంతరం కవచం వలే రక్షణ చేస్తూ విద్యార్థుల భవితను తీర్చిదిద్దటానికి తోడుగా ఉంటోందన్నారు. ఉపాధ్యక్షుడు శ్రీరామమూర్తి మాట్లాడుతూ ర్యాంకులను సాధించిన విద్యార్థులకు శుభాశీస్సులు తెలిపారు.